క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం మడికొండలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని హనుమకొండ డీఈ సాంబరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు సబ్‌స్టేషన్ పరిధిలోని మునిపల్లి, పెంబర్తి, చింతగట్టు, భీమారం, గంటూరుపల్లి, ఎర్రగట్టు, హసన్‌పర్తి పరిధిలో శనివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ అశోక్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

నేడు కేయూ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సెమినార్

కేయూ క్యాంపస్: మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 15న ఒకరోజు సెమినార్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భిక్షాలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీడియో ఎన్‌కోడింగ్ యూసింగ్ ఎంఎల్ అనే అంశంపై విశ్వవిద్యాలయంలోని పరిపాలన భవనం సెనెట్ హాల్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

21న జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్: ఈనెల 21న కేయూ సెంట్రల్ లైబ్రరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ ఆధ్వర్యంలో 'వన్ నేషన్.. వన్ సబ్‌స్క్రిప్షన్' అనే అంశంపై ఒకరోజు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సెమినార్ డైరెక్టర్, కేయూ లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జ్ జీజే శ్రీలత, కన్వీనర్ డాక్టర్ బి.రాధిక రాణి తెలిపారు. సదస్సు పోస్టర్లను వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో లైబ్రరీ అసిస్టెంట్లు ప్రభాకర్, తేజావత్ జావేర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

మెప్మా ఉద్యోగిపై చర్య తీసుకోవాలని వినతి

హన్మకొండ అర్బన్: కలెక్టరేట్‌లోని మెప్మా కార్యాలయంలో అవుట్ సోర్సింగ్‌లో పనిచేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న ఉద్యోగిపై విచారణ జరిపి చర్య తీసుకోవాలని బాధితుల తరపున దయాకర్, సందీప్ కోరారు. ఈమేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్యకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. సదరు ఉద్యోగి గతంలో రెవెన్యూ శాఖలో పనిచేసి అవినీతి అక్రమాలకు పాల్పడి ఏసీబీకి పట్టుబడి సస్పెండ్ అయ్యారని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉద్యోగ విరమణ పొందిన తర్వాత అక్రమంగా అవుట్‌సోర్సింగ్ ద్వారా చేరి మెప్మా సిబ్బంది, ఫీల్డ్ స్టాఫ్‌ను ఇబ్బంది పెడుతూ డబ్బులు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఈక్రమంలో ఆ ఉద్యోగిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

డైరీ ఆవిష్కరణ



హన్మకొండ అర్బన్: జిల్లా ప్రజా పరిషత్ సీఈఓలు, డిప్యూటీ సీఈఓల నూతన సంవత్సర -2025 డైరీని హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో హనుమకొండ జెడ్పీ సీఈఓ ఎం.విద్యాలత, డీఆర్‌డీఓ మేన శ్రీను, డిప్యూటీ సీఈఓ భూక్య రవి, అడిషనల్ డీఆర్‌డీఓ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓల సంఘం అధ్యక్షుడు పెద్ది ఆంజనేయులు పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ కేడెట్‌కు అభినందన



హసన్‌పర్తి: జాతీయ స్థాయి ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొని ప్రశంస పత్రాలు అందుకున్న కిట్స్ కళాశాలకు చెందిన కంప్యూటర్ సైన్స్ విద్యార్థి వడ్డేవరం సిద్ధార్థను కళాశాలలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ఈనెల 3నుంచి 9వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా వైఎస్సార్ కళాశాలలో జరిగిన జాతీయ స్థాయి ఎన్ఎస్ఎస్ శిబిరంలో సిద్ధార్థ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్ధార్థను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కోమల్‌రెడ్డి, ప్రొఫెసర్ వేణుమాధవ్, డాక్టర్ ప్రభాకరాచారి, డాక్టర్ నిరంజన్, డాక్టర్ సతీష్‌చంద్ర, పీఓఎస్ భార్గవి సన్మానించారు.

విద్యార్థిపై దాడి చేసిన వ్యక్తులను శిక్షించాలి

ఖిలా వరంగల్: తమిళనాడుకు చెందిన డిగ్రీ విద్యార్థిపై దాడి చేసి రెండు చేతులు నరికివేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు రాజు డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ 39వ డివిజన్ శాకరాశికుంట ఎస్సీ కాలనీలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమిళనాడు రాష్ట్రం శివగంగా జిల్లా మేల్ పీడపూర్ గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి అయ్యస్వామి (ఎస్సీ) బుల్లెట్ బండిపై కళాశాలకు వెళ్తుండగా.. ఓర్వలేని అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు దాడి చేసి అతని రెండు చేతులను దారుణంగా నరికి వేయటం బాధాకరమన్నారు. కార్యక్రమంలో తాళ్లపల్లి రాజు, కలావల రాహుల్, ఆకారపు మహేష్, మాదాసు శ్యామ్, వస్కుల వంశీ పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్ల ప్రారంభం ఎప్పుడో?

- నిరుపయోగంగా మారిన న్యూశాయంపేటలోని డబుల్ బెడ్రూం ఇళ్లు
- ఏడేళ్లుగా అర్హుల ఎదురుచూపులు



న్యూశాయంపేటలో ఏడేళ్లుగా నిరుపయోగంగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లు

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం న్యూశాయంపేటలో గృహ ప్రవేశాలకు సిద్ధంగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులు మాత్రం చేయలేదు. దాంతో ఎప్పుడు ఇళ్లు కేటాయిస్తారో, గృహ ప్రవేశాలు ఎప్పుడో అని ఏడేళ్లుగా అర్హులు ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వం డబుల్ బెడ్రూం ఇళ్లను నిర్మించి పంపిణీ చేయకుండా వదిలేసింది.

ఏడేళ్లుగా ఎదురుచూపులు

న్యూశాయంపేటలో 2018లో 8.12 ఎకరాల విస్తీర్ణంలో 19 బ్లాకులుగా విభజించి 608 డబుల్ బెడ్రూం ఇళ్లను శరవేగంగా ఏడాదిలోపే పూర్తి చేశారు. అనంతరం అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇళ్లను కేటాయించకుండా జాప్యం చేస్తున్నారు. నూశాయంపేటకు చెందిన 42 మంది దళితులకు చెందిన 8.12 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన 608 డబుల్ బెడ్రూం ఇళ్లను దళితులకు తొలుత కేటాయించి, తర్వాత అర్హులైన నిరుపేదలకు కేటాయించాలని ప్రజాపాలనలో వినతులు అందజేశారు. ఇటీవల ప్రజాపాలనలో భాగంగా నిర్వహించిన వార్డు సభల్లో న్యూశాయంపేటకు చెందిన నిరుపేదలు 444 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని పలువురు కోరుతున్నారు.

మాకు సొంత భూమి, ఇల్లు లేదు



మాకు సొంత భూమి, ఇల్లు లేదు. ఇందిరమ్మ ఇంటి కోసం ఇటీవల వార్డు సభలో దరఖాస్తు చేసుకున్నాం. నిరుపేద కుటుంబానికి చెందిన మాము ఇంటి అద్దె చెల్లించడం కష్టంగా ఉంది. డబుల్ బెడ్రూం లేదా ఇందిరమ్మ ఇల్లు కేటాయించి ఆదుకోవాలి.

\- కోరుకొప్పుల రాజేష్‌ఖన్నా, న్యూశాయంపేట

నాట్య వేదం రచించిన మహాయోగి భరతముని



మాట్లాడుతున్న బందెల మోహన్‌రావు

రామన్నపేట: నాలుగు వేదాల నుంచి శ్రుతిలయలు, భావతాళాలు, రాగగతులు, రససిద్ధాంతాల ఆధారంగా 'నాట్య వేదం' రచించిన మహాయోగి భరతముని అని సంస్కార భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బందెల మోహన్‌రావు అన్నారు. సంస్కార భారతి వరంగల్ శాఖ, టెంపుల్ డాన్స్ స్కూల్స్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'భరతముని స్మరణ దివస్' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నృత్యం, నాటకం, సంగీతం, రంగస్థలం లాంటి ప్రదర్శన కళల సమగ్ర గ్రంథం నాట్య వేదం అని వివరించారు. అనంతరం అనిశ్రిత రెడ్డి, జనన్మ వర్మల కూచిపూడి నృత్యం, శివానీరెడ్డి వయోలిన్ ప్రదర్శన, అక్షర, సాహితి గీతాలాపన అలరించాయి. కార్యక్రమంలో సంస్కార భారతి రాష్ట్ర కార్యదర్శి వెంకట్‌రెడ్డి, సభ్యులు హరినాథ్ రావు, దేవేందర్, సృజనరెడ్డి, సతీష్‌రెడ్డి, హిమాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత స్థానానికి చేరుకోవాలి



రామన్నపేట: యువత లక్ష్యాలను ప్రేమిస్తూ ఉన్నత స్థానానికి చేరుకోవాలని అధ్యాపకురాలు, సైకాలజిస్ట్ డాక్టర్ ఎస్.అనిత్ అన్నారు. ప్రేమికుల రోజు సందర్భంగా నగరంలోని ఏవీవీ జూనియర్ కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కోడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులతో 'ప్రేమ వర్సెస్ లక్ష్యం' అనే అంశంపై శుక్రవారం చర్చాగోష్ఠి నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ యువతకు ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రేమ కన్నా లక్ష్యం ఎంతో ముఖ్యమని తెలిపారు. అధ్యాపకురాలు రమ్య, సీనియర్ వలంటీర్ దేవిశ్రీ ప్రసాద్, దస్తగిరి, చిరంజీవి పాల్గొన్నారు.

విచక్షణతో ఇంటర్నెట్ వినియోగించాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఏసీపీ, తదితరులు

- సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్‌కుమార్

కాజీపేట అర్బన్: విచక్షణతో ఇంటర్నెట్‌ను వినియోగించాలని సైబర్ క్రైమ్ ఏసీపీ విజయ్‌కుమార్ సూచించారు. ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ నక్కలగుట్టలోని కాకతీయ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సేఫర్ ఇంటర్నెట్ డే -25 కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడారు. ఇంటర్నెట్ వినియోగంతో లాభాలతో పాటు నష్టాలు ఉన్నాయని అన్నారు. మహిళలు, పిల్లలు ఇంటర్నెట్ ఆన్‌లైన్ వినియోగంతో లైంగిక వేధింపులకు గురవుతున్నారని వాపోయారు. సైబర్ నేరానికి గురైనట్లు గ్రహిస్తే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్లు 1930, 100, 1098కు సమాచారం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఇన్‌స్పెక్టర్ వెంకన్న, షీటీమ్స్ ఇన్‌స్పెక్టర్ సుజాత, మాజీ సీడబ్ల్యూసీ చైర్మన్ అనితారెడ్డి, ఎఫ్ఎంఎం సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, పీడీ ఎర్ర శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బెటర్ ఇంటర్నెట్ బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి



కాజీపేట అర్బన్: సుర్జీత్‌నగర్ కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు అందజేయాలని సీపీఎం హనుమకొండ జిల్లా కమిటీ సభ్యుడు ఎం.చుక్కయ్య కోరారు. న్యూశాయంపేటలోని సుర్జీత్‌నగర్ కాలనీలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా కాలనీ అభివృద్ధికి నోచుకోవడం లేదని, దాంతో నిరుపేదలు దుర్భర జీవితం గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు వంగ సదానందం, కారు ఉపేందర్, ప్రభాకర్, మొగిళి, వనమాల, రజిత, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కష్టపడేతత్వాన్ని అలవర్చుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న దామోదర్

హసన్‌పర్తి: చిన్నప్పటి నుంచే కష్టపడే తత్వాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని సీడబ్ల్యూసీ సభ్యుడు కజాంపురం దామోదర్ సూచించారు. ఎల్లాపురం సమీపంలోని మహాత్మాజ్యోతిరావు పూలే బాలిక విద్యాలయంలో 'సంస్కార వికాస శిక్షణ'పై విద్యార్థినులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరంతర శ్రమ, సమయపాలన.. విజయానికి ఎంతగానో దోహదపడుతాయన్నారు. లక్ష్యాన్ని చేరుకోవాలంటే విద్యపై ఆసక్తి పెంచుకుంటూ ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్ మాట్లాడుతూ క్రమశిక్షణతో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని వివరించారు. 'షేర్' సంస్థ సభ్యులు భూక్య జగన్, గాయత్రి, హెచ్ఎం శోభారాణి, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు రవీందర్, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హ్యాండ్లూమ్ సమస్యల పరిష్కారానికి..



నయీంనగర్: సహకార భారతి వీవర్స్ సెల్ ఆధ్వర్యంలో హ్యాండ్లూమ్, పవర్‌లూమ్ సమస్యల పరిష్కారానికి అఖిల భారత వీవర్స్ సెల్ అధ్యక్షుడు అనంత కుమార్ మిశ్రా హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో సమావేశాలు నిర్వహిస్తారని తమ్మి నర్సయ్య తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నర్సయ్య మాట్లాడుతూ సమావేశాల్లో వీవర్స్ సమస్యలు తెలుసుకొని వాటి పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా రావాల్సిన సబ్సిడీలు, పథకాల కొరకు ప్రయత్నించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో వెంకటేశ్వర్లు, సుమంత్, యాదగిరి పాల్గొన్నారు.


ఎయిడ్స్ నియంత్రణకు కృషి చేయాలి



మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి

రామన్నపేట: హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, ఎయిడ్స్‌పై విద్యార్థులు అవగాహన ఉండాలని కాకతీయ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఎల్‌బీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ ఎలా వ్యాప్తి చెందుతోంది, ఎలా అరికట్టాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ అప్పయ్య, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రాజేందర్, కేయూ ప్రొఫెసర్ ఈసం నారాయణ, టీజీఏసీఎస్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్, డాక్టర్ రాంబాబు, ఎన్ఎస్ఎస్ డిస్ట్రిక్ట్ కన్వీనర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ అధికారి సదానందం, అధ్యాపకులు పాల్గొన్నారు.


రౌషన్ షహీద్ దర్గా ఉత్సవాలు ప్రారంభం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, తదితరులు

ఖిలా వరంగల్: మతాలకు అతీతంగా హజ్రత్ సయ్యద్ రౌషన్ షహీద్ రహ్మతుల్లాహి హలై ఉర్సు షరీఫ్ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ సమీపంలో ఖమ్మం ప్రధాన రహదారిపై ఉన్న రౌషన్ షహీద్ మసీద్ దర్గా ప్రాంగణంలో అధ్యక్షుడు సయ్యద్ షహీ ఆరిపొద్దీన్ హుస్సైనీ సాబేరి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఉర్సు ఉత్సవాల వాల్‌పోస్టర్లను మత పెద్దలతో కలిసి ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య ఆవిష్కరించారు. శనివారం సాయంత్రం 8గంటలకు గంధం ఉత్సవం ప్రారంభం కానుంది. కార్యక్రమంలో హైమద్ బాబా, జావిద్‌పాషా, ఖదీర్‌పాషా, సయ్యద్ నవాజ్ తదితరులు పాల్గొన్నారు.

బుచ్చయ్య గౌడ్‌కు బెస్ట్ లీడర్‌షిప్ అవార్డు



అవార్డు అందుకుంటున్న బుచ్చయ్యగౌడ్

కాజీపేట అర్బన్: విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం -327 వరంగల్ జిల్లా కార్యదర్శి మచ్చిక బుచ్చయ్యగౌడ్.. బెస్ట్ లీడర్‌షిప్ అవార్డు అందుకున్నారు. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఐఎన్‌టీయూసీ అనుబంధ సంఘాల్లో విశేష కృషి చేస్తున్న నాయకులకు ప్రతిఏటా అవార్డులు ప్రదానం చేస్తున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన వేడుకల్లో సంజీవరెడ్డి, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల సంఘం -327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ చేతుల మీదుగా బెస్ట్ లీడర్‌షిప్ అవార్డును బుచ్చయ్యగౌడ్ అందుకున్నారు.

సంక్షిప్తంగా

వైద్య కళాశాలల్లో ప్రాక్టికల్స్ దందాను అరికట్టాలి

కేయూ క్యాంపస్: కాళోజీ హెల్త్ యూనివర్సిటీలోని పలు వైద్య కళాశాలల్లో ప్రాక్టికల్స్ దందా కొనసాగుతోందని, ప్రాక్టికల్స్ పరీక్షల పేరిట విద్యార్థుల నుంచి కొంతమంది డబ్బులు వసూలు చేస్తున్నారని, ఈ దందాను అరికట్టాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆరెగంటి నాగరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కేయూలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాక్టికల్స్ పరీక్షల్లో ఎక్కువ మార్కులు వేస్తామని నమ్మబలికి విద్యార్థుల నుంచి వసూళ్లకు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి దందా వలన కష్టపడి చదువుకునే విద్యార్థులకు నష్టం జరిగే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం కేయూ అధ్యక్షుడు సుమన్‌రాజ్, బాధ్యులు తరుణ్, రాఘవేందర్, రవితేజ, నితిన్, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీ భవన్‌కు వెళ్లిన కాంగ్రెస్ శ్రేణులు

వరంగల్: హైదరాబాద్ గాంధీ భవన్‌లో కులగణనపై జరిగిన సమావేశంలో పాల్గొనేందుకు వరంగల్ తూర్పు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ నేతృత్వంలో పలువురు నాయకులు పలు వాహనాల్లో వరంగల్ పోచమ్మమైదాన్ నుంచి గురువారం బయలుదేరి వెళ్లారు. తూర్పులో కాంగ్రెస్ రెండు వర్గాలుగా ఏర్పాటు కావడంతో పోటాపోటీగా వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో నాయకులు నరేంద్రకుమార్, గోరంటల రాజు, బస్వరాజు శ్రీమాన్, జన్ను రవి, కోదాటి అనిల్, కరాటే ప్రభాకర్, చాగంటి శ్రీనివాస్, ఆరెల్లి రవి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొరిమి పరమేష్, అర్బన్ అధ్యక్షుడు సునీల్, సలీం పాల్గొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు

వరంగల్ చౌరస్తా: హైదరాబాద్ గాంధీ భవన్‌లో జరగనున్న బీసీ రిజర్వేషన్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను వీక్షించేందుకు వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. వరంగల్ రాంకీ వద్ద కార్ల ర్యాలీని కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్‌రాజు జెండా ఊపి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు మీసాల ప్రకాష్, జారతి రమేష్, కొత్తపల్లి శ్రీనివాస్, కత్తెరసాల వేణుగోపాల్, మంతెన సునీత, కార్పొరేటర్లు చింతాకుల అనిల్‌కుమార్, బస్వరాజు కుమార్, బాలినే సురేష్, నాయకులు గుండు పూర్ణచందర్, బైరబోయిన దామోదర్ యాదవ్, పల్లం రవి, ముష్కమల్ల సుధాకర్, కంకణాల సదానందం, వనపర్తి శ్రీనివాస్, బాసాని శ్రీనివాస్, చిప్ప వెంకటేశ్వర్లు, సంగరబోయిన చందర్, ఎలగం సత్యనారాయణ, మిట్టపల్లి సాంబయ్య, డోలి చిన్ని, మేడిది మధు, తొగర్ క్రాంతి తదితరులు ఉన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి ప్రమాణ స్వీకారానికి వెళ్లిన నాయకులు

వరంగల్: తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవానికి వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొరివి పరమేష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు శుక్రవారం బయలుదేరి వెళ్లారు.

చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ

కాజీపేట అర్బన్: న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో హనుమకొండలోని కాళోజీ జంక్షన్‌లో ఈనెల 20వ తేదీన నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమ వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. 6 గ్యారంటీలు అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు రాచర్ల బాలరాజు, దయాకర్, కృష్ణ, కరుణాకర్ రెడ్డి, మర్రి మహేష్, గణేష్, పవన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పేదల ఉచితాలపై న్యాయమూర్తుల వ్యాఖ్యలు బాధాకరం

వరంగల్: రైతు కూలీలు, అసంఘటిత రంగ కార్మికులు, చేతివృత్తుల వారు, పేదలకు ప్రభుత్వాలు ఇస్తున్న ఉచిత పథకాలకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు న్యాయమూర్తులు వ్యాఖ్యానించడం బాధాకరమని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉపాధి దొరక్క, కష్టానికి తగిన ప్రతిఫలం లభించక, పాలకుల విధానాలతో నిత్యావసర వస్తువుల ధరలు పెంపుతో, విద్యా, వైద్యం ఖర్చులు అంతులేకుండా పెరుగుతుండడంతో పేదలు దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. అలాంటి వారికి ఎంతోకొంత ఉపశమనం కలిగించే విధంగా పాలకులు పెట్టిన ఉచిత పథకాలకు వ్యతిరేకంగా న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలు సామాజిక న్యాయానికి విరుద్ధంగా ఉన్నాయని విమర్శించారు. బడా పారిశ్రామిక వేత్తలకు వేలకోట్ల రూపాయల రాయితీలను పాలకులు అందజేస్తుంటే వాటిపై స్పందించని న్యాయమూర్తులు.. అర్హత కలిగిన పేదలకు ఇస్తున్న ఉచిత పథకాలపై మాట్లాడడం దుర్మార్గమని ఆయన అన్నారు.

సమన్వయంతోనే సదస్సుల నిర్వహణ



ఆల్బమ్‌ను వీసీకి అందజేస్తున్న అధ్యాపకులు

కేయూ క్యాంపస్: సమష్టితత్వం, సమన్వయంతో జాతీయ స్థాయి సదస్సుల నిర్వహణ సాధ్యమని కాకతీయ యూనివర్సిటీ నిరూపించిందని కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. కేయూలో చరిత్ర, టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ప్రొఫెసర్ మనోహర్ సారథ్యంలో నిర్వహించిన 82వ ఇండియన్ హిస్టరీ కాంగ్రెస్, 49వ ప్లేస్ నేమ్స్ సొసైటీ వార్షిక సమావేశానికి సంబంధించిన దృశ్యమాలిక ఆల్బమ్‌ను శుక్రవారం సమర్పించిన సందర్భంగా ఆ విభాగం అధ్యాపకులతో వీసీ మాట్లాడారు. ఇలాంటి కార్యక్రమాలు యూనివర్సిటీ ప్రతిష్ఠను మరింతగా పెంచుతాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం, విభాగం అధిపతి డాక్టర్ రాజ్‌కుమార్, అధ్యాపకులు సుమంత్, నాగేశ్వర్‌రావు, కేవీఎస్ నరేందర్, శ్రీధర్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం



నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నాయకులు

- పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీ

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరన్నర కాలం గడుస్తున్నా విద్యాశాఖ మంత్రిని నియమించకుండా జాప్యం చేస్తూ విద్యారంగాన్ని గాలికొదిలేసి, కేసీఆర్ అడుగుజాడల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి పాలన కొనసాగిస్తున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పృథ్వీ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నర్సింహారావు ఆరోపించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కాకతీయ యూనివర్సిటీ లైబ్రరీ బిల్డింగ్ వద్ద నాయకులతో కలిసి శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యారంగం పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్‌లో విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించి, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కావ్య, అనూష, బాలు, శ్రీజ, సాధన, గణేష్, చారి, వంశీ, వినయ్, పవన్‌కల్యాణ్, గని, యాదగిరి, హరికృష్ణ, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్

విద్యారణ్యపురి: ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ డిమాండ్ చేశారు. హనుమకొండలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పలు కళాశాలలు ఒక్క కళాశాలకు మాత్రమే అనుమతి తీసుకొని పలు బ్రాంచీలను ఏర్పాటు చేసుకొని నడుపుతున్నప్పటికీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిబంధనలకు వ్యతిరేకంగా నడుపుతున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి బి.రెడ్డి, జశ్వంత్, సాయికుమార్, మల్లేశ్, అజయ్, పవన్, నాగరాజు, సాయిహర్ష పాల్గొన్నారు.

ఆధునిక సాంకేతికతతో సులువుగా వ్యవసాయం



డ్రోన్‌పై అవగాహన కల్పిస్తున్న తయారీదారులు

వరంగల్: ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతికతతో వ్యవసాయ సులువుగా చేయవచ్చని, తద్వారా అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ పరిశోధన స్థానం డీన్ ఉమారెడ్డి అన్నారు. ఆరెపల్లిలోని వ్యవసాయ పరిశోధన స్థానంలో అగ్రిహబ్ రూరల్ ఇన్నోవేషన్ స్పైస్ ఆధ్వర్యంలో అగ్రిటెక్ మార్కెట్ యాక్సెస్ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ ఆధునిక సాంకేతికతలు, సౌరశక్తి వినియోగ విధానం, అందుబాటులో ఉన్న సాంకేతిక అవకాశాలపై పలువురు శాస్త్రవేత్తలు వివరించారు. రైతులకు రోబోటెక్ స్ప్రేయర్లు, వీడర్స్, బాక్ త్రిప్స్‌ను నివారించే సొల్యూషన్, తక్కువ ధరలకు అందుతున్న ఆధునిక యంత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో అగ్రిట్యాబ్ సీఈఓ విజయన డిమింటి, డాక్టర్ దిలీప్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

పుల్వామా అమరవీరులకు నివాళి

జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో అమరులైన భారత పారామిలటరీ సిబ్బందికి నగరవ్యాప్తంగా శుక్రవారం ఘన నివాళులర్పించారు. పుల్వామా దాడికి వ్యతిరేకంగా ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2019, ఫిబ్రవరి 14న పుల్వామాలో భారత పారామిలటరీ సిబ్బంది కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు జరిపిన దాడిలో 40 మంది భారత జవాన్లు అమరులయ్యారని గుర్తుచేశారు.

\- సాక్షి నెట్‌వర్క్



పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో అమరులకు నివాళులర్పిస్తున్న ఎన్‌సీసీ కేడెట్లు



ఖిలా వరంగల్: విద్యానగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాలనీవాసులు



హసన్‌పర్తి: ముచ్చర్లలో వీరజవాన్లకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న ప్రజలు